హాస్టల్‌కు విద్యార్థులు కావలెను!

- బాల్కొండ ఇంటిగ్రేటెడ్ వసతిగృహంలో 300 సీట్లకు గాను 210 సీట్లు ఖాళీ
- ఆసక్తి చూపని విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు


బాల్కొండ మండల కేంద్రంలోని సమీకృత బాలుర వసతిగృహం

బాల్కొండ: మండల కేంద్రంలోని బాలుర ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌కు విద్యార్థులు కావలెను. ప్రస్తుతం హాస్టల్‌లో 300 సీట్లు ఉంటే 90 మంది విద్యార్థులు మాత్రమే వసతి పొందుతున్నారు. ఈ వసతిగృహంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకునే వారు వసతి పొందవచ్చు. కానీ ఈ హాస్టల్‌లో ఉండటానికి విద్యార్థులు ఆసక్తి కనబరచడం లేదు. దీంతో సీట్లు ఖాళీగా ఉంటున్నాయి.

బడి దూరంగా ఉండటంతో..

మండల కేంద్రంలోని సమీకృత హాస్టల్లో విద్యార్థులు ఉండకపోవడానికి కారణం ప్రభుత్వ ఉన్నత పాఠశాల దూరంగా ఉండటం. ఈ హాస్టల్ వన్నెల్ (బి) రోడ్డుకు ఉంటే పాఠశాల బాల్కొండ మండల కేంద్రంలో లోపల ఉంది. దీంతో విద్యార్థులు ప్రతిరోజు ఉదయం 2కిలోమీటర్లు, సాయంత్రం రెండు కిలోమీటర్లు కాలినడకన వెళ్లిరావాలి. అది జాతీయ రహదారి 44ను దాటుకుంటు పోవాలి. దీంతో విద్యార్థులను హాస్టల్‌లో ఉంచడానికి విద్యార్థుల తల్లిదండ్రులు ఇష్టపడటం లేదు. హాస్టల్‌లో గత రెండు సంవత్సరాల నుంచి పూర్తి స్థాయి వార్డెన్ కూడ లేరు. దీంతో బాలికల కళాశాల వార్డెన్ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోకపోవడం కూడ కారణంగా చెప్పవచ్చు.

రవాణా సౌకర్యం కరువు..

సమీకృత హాస్టల్ నుంచి పాఠశాల వరకు ప్రయాణం సౌకర్యం ఏర్పాటు చేస్తామని పాలకులు, అధికారులు గతంలో ప్రకటించారు. కానీ ఇప్పటికీ ఎలాంటి రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలేదు. దీంతో విద్యార్థులు కాలినడకనే పాఠశాలకు వెళ్తున్నారు. పాఠశాల, హాస్టల్ పక్కపక్కనే ఉంటే విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఉండే అవకాశం ఉంది. కానీ ఇక్కడ అలాంటి పరిస్థితి లేదు. కనీసం ఉదయం, సాయంత్రం రవాణా సౌకర్యం కల్పించినా విద్యార్థులు ఉండటానికి ఇష్టపడతారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, హాస్టల్ నుంచి రవాణ సౌకర్యం కల్పించాలని, వార్డెన్‌ను నియమించి, విద్యార్థుల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం..

హాస్టల్‌లో మిగిలిన సీట్లను గురించి ఉన్నత అధికారులకు నివేదించాం. ప్రధానంగా పాఠశాల దగ్గరగా లేకపోవడం వల్ల విద్యార్థులు హాస్టల్‌కు రావడం లేదు. విద్యార్థులు రోజూ కాలినడకన పాఠశాలకు వెళ్తుంటారు. రోడ్డు దాటడం ఇబ్బందిగా ఉండటంతో విద్యార్థులు రావడం లేదు.

– వాణి, ఇన్‌చార్జి వార్డెన్, బాల్కొండ

బీఆర్‌ఎస్ వెంటే పల్లె ప్రజలు



ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న యువకులు.. ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ప్రజలు

- ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి
- పలువురు బీఆర్‌ఎస్‌లో చేరిక

ఆర్మూర్: పల్లె ప్రజలంతా బీఆర్‌ఎస్ వైపే ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్, హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా తాను విజయం సాధిస్తానని పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అంకాపూర్‌లోగల ఆయన నివాసంలో శుక్రవారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇటీవల గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసిన ఆర్మూర్ మండలం చేపూర్ సమీపంలోని పల్లె ప్రజలు తరలివచ్చి బీఆర్‌ఎస్‌కే మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటిస్తూ తీర్మానం ప్రతిని ఎమ్మెల్యేకు అందజేశారు. నియోజకవర్గంలోని పలు కుల సంఘాల ప్రతినిధులు బీఆర్‌ఎస్‌కు మద్దతు ప్రకటిస్తూ బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.

వైద్యులు నిస్వార్థ సేవలందించాలి..

ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు నిస్వార్థంగా రోగులకు సేవలందించాలని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కోరారు. పెర్కిట్ శివారులోని వెంకటేశ్వర గార్డెన్ సమీపంలో డాక్టర్స్ అసోసియేషన్ భవన నిర్మాణానికి శుక్రవారం ఆయన భూమిపూజ నిర్వహించారు. పట్టణంలో వివిధ కులాలకు ఇప్పటికే 27 ఫంక్షన్ హాళ్లకు నిధులు మంజూరు చేసామని ఎమ్మెల్యే తెలిపారు. చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మధుశేఖర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎల్ఎంబీ రాజేశ్వర్, కౌన్సిలర్లు, వైద్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

మాక్లూర్: మండలంలోని చిక్లి గ్రామస్తులు శుక్రవారం ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిని కలిసి సన్మానించారు. చిక్లి, గుంజ్లి మధ్యలో నిర్మించనున్న లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు రూ.58 కోట్లు మంజూరు చేయటంతో పాటు, మున్నూరుకాపు సంఘం మినీ కల్యాణ మండపం నిర్మాణానికి రూ: 10 లక్షలు ఇవ్వటంతో గ్రామస్తులు ఆయనను సన్మానించారు. బీఆర్‌ఎస్ నాయకులు దీమెర శ్రీకాంత్, గోపు రంజిత్, వీడీసీ సభ్యులు బోజన్న, షేర్‌ఖాన్, శంకర్, డి రాజేందర్, రాజేశ్వర్,, రమేష్, నరేష్‌లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సరిపడా మాత్రలను పంపిణీ చేయాలి



పెర్కిట్(ఆర్మూర్): ప్రతి వ్యాధిగ్రస్తుడికి క్రమం తప్పకుండా నెలకు సరిపోయే విధంగా బీపీ, షుగర్ మాత్రలను అందజేయాలని సిబ్బందికి డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి అశోక్ సూచించారు. ఆర్మూర్ మండలం చేపూర్‌లో శుక్రవారం అసంక్రమిత వ్యాధుల ఔషధాల పంపిణీ ప్రక్రియను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. చిన్నపాటి వ్యాయామాలను చేయడం ద్వారా వ్యాధులను అదుపులో ఉంచుకోవచ్చని వ్యాధిగ్రస్తులకు సూచించారు. ఆరోగ్య కార్యకర్త సుల్తానా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ కార్యవర్గాలు ఏర్పాటు



నందిపేట్: మండలంలోని కుద్వాన్‌పూర్, వన్నెల్ కే, సిద్ధాపూర్ షాపూర్ గ్రామాలలో శుక్రవారం కాంగ్రెస్ గ్రామ కమిటీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంద మహిపాల్ ఆధ్వర్యంలో గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. కుద్వాన్‌పూర్ గ్రామ కమిటీ అధ్యక్షులుగా నంగి గంగాధర్ సిద్ధాపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మేకల గంగారెడ్డి, షాపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా సంతోష్ ఎన్నికయ్యారు. నాయకులు ప్రశాంత్ వైయస్ గంగాధర్ పిరాజీ నాగరాజు తుక్కన్న, ఎర్రం పవన్ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

వర్ని: గ్రామపంచాయతీ కార్మికులను విధుల్లోకి రావద్దని, కక్ష సాధింపులకు పాల్పడుతున్న సత్యనారాయణపురం సర్పంచ్ నాగమణి, కార్యదర్శి సాయిలుపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని జీపీ కార్మికులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం వారు మీడియాతో మాట్లాడారు. సర్పంచ్, కార్యదర్శి తీరు మార్చుకోకపోతే మండలంలోని గ్రామపంచాయతీ కార్మికులందరూ గ్రామపంచాయతీ ఎదుట ఆందోళన చేపడుతామన్నారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్, కార్మికులు సాయిచరణ్, రాజు, సాయిలు, మారుతి, గంగారం తదితరులు పాల్గొన్నారు.

కబ్జా నుంచి కాపాడాలి

రుద్రూర్: పోతంగల్‌లోని పెద్ద పోచమ్మ ఆలయ భూమిని కబ్జా నుంచి కాపాడాలని కోటగిరి మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి బజరంగ్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఆయన స్థానికులతో కలిసి తహసీల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. భూకబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అశోక్, రమేష్, గంగారాం, నారాయణ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి

బోధన్: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కరించాలని ఎమ్మెల్యే మహ్మద్ షకీల్‌ను శుక్రవారం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు విఘ్నేష్, డివిజన్ కన్వీనర్ సాయికుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలో వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల్లో సరిపడా బోధన సిబ్బంది లేరన్నారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాలలు, హాస్టల్ భవనాలకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. నాయకులు మహేష్, ప్రశాంత్, రాజు, కళ్యాణ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

బోధన్: పట్టణంలోని నిజాం దక్కన్ షుగర్ ఫ్యాక్టరీ ఎదుట ఫ్యాక్టరీ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 7వ రోజు కొనసాగాయి. దీక్షలో కార్మికులు ఎస్‌కే మోహినుద్దీన్, మోహిన్ బేగ్‌లు కూర్చున్నారు. ఫ్యాక్టరీ మూసివేతతో కార్మికులు రోడ్డున పడ్డారని, అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కార్మిక నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి



నవీపేట: గ్రామాల్లో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ నర్సింగ్ రావ్ సూచించారు. మండలంలోని నాళేశ్వర్ గ్రామంలో శుక్రవారం పార్టీ కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలపై ఇంటింటికి అవగాహన కల్పించాలని పార్టీ శ్రేణులకు ఆయన సూచించారు. సొసైటీ చైర్మన్‌లు అబ్బన్న, హన్మండ్లు, నాయకులు కిషోర్‌రావ్, బుచ్చన్న, సాయిరెడ్డి పాల్గొన్నారు.

నియామకం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ నియోజకవర్గ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా ఆలూర్ మండలం గుత్ప గ్రామానికి చెందిన బాశెట్టి శశి కుమార్ నియమితులయ్యారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ సూచనతో జిల్లా అధ్యక్షుడు వేణురాజ్ నియామకపత్రం అందజేశారు.

కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను క్రమబద్ధీకరించాలి


ఆర్మూర్‌లో బైఠాయించిన కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు

ఆర్మూర్‌టౌన్: కాంట్రాక్ట్ ఏఎన్ఎంలందరినీ క్రమబద్ధీకరించాలని జిల్లా కాంట్రాక్ట్ ఏఎన్ఎంల అధ్యక్షురాలు గంగజమున అన్నారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రి ఆవరణలో శుక్రవారం ఆమె కాంటాక్ట్ ఏఎన్ఎంలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరీక్ష విధానం రద్దు చేసి కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను పర్మినెంట్ చేయాలని సీఎం కేసీఆర్, మంత్రి హరీష్‌రావులకు విజ్ఞప్తి చేశారు. ఏఎన్ఎంలు ప్రమీల, శ్యామల, అమృత, రాజవ్వ, రజిత పాల్గొన్నారు.

బోధన్ ఎమ్మెల్యేకు వినతి

బోధన్: తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్లు, సెకండ్ ఏఎన్ఎంలు శుక్రవారం బోధన్‌లో ఎమ్మెల్యే షకీల్‌ను కలిసి వినతిపత్రం అందించారు. సీఐటీయూ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్, గంగాధర్, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నివారణ టీకాలు



మాక్లూర్: మండలంలోని మాణిక్‌భండార్ తండాలో శుక్రవారం పశు వైద్య సిబ్బంది పశువులకు గాలికుంటు వ్యాధినివారణ టీకాలు వేశారు. మండల పశువైద్యులు కిరణ్‌దేశ్‌పాండే, ఉమా సహెర్, సిబ్బంది పాల్గొన్నారు.

రుద్రూర్: కోటగిరి మండలం అడ్కాస్‌పల్లి గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. సర్పంచ్ రామకృష్ణ , పశువైద్యాధికారి సురేష్ కుమార్, వెటర్నరి అసిస్టెంట్ సుధీర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలి


ఐకేపీ సిబ్బందితో మాట్లాడుతున్న చందర్‌నాయక్

పెర్కిట్(ఆర్మూర్): ఐకేపీ సిబ్బంది నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని, అందులో భాగంగా లబ్ధిదారులను గుర్తించి రుణాలను అందజేయాలని డీఆర్‌డీవో పీడీ చందర్‌నాయక్ సూచించారు. ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఐకేపీ సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా చందర్‌నాయక్ మాట్లాడుతూ.. పీఎంఎఫ్ఎంఎఫ్ పథకం కింద లబ్ధిదారులను గుర్తించాలన్నారు. మండలంలోని అంకాపూర్, ఇస్సాపల్లి గ్రామాల్లో సంపద వనాలు కింద నాటిన మొక్కలను పీడీ పరిశీలించారు. అనంతరం ఈజీఎస్ సిబ్బందితో సమావేశమై హరితహారం, ఉపాధి హామి కూలీలకు కల్పించే పనులపై సమీక్ష నిర్వహించారు. ఐకేపీ ఏపీఎం గంగారాం, ఈజీఎస్ ఏపీవో సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రెంజల్‌లో రైతుల మహా ధర్నా


మహాధర్నాలో పాల్గొన్న రైతులు, రైతు కూలీలు


మాట్లాడుతున్న కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి

రెంజల్(బోధన్): రెంజల్ రైతు సంఘం అధ్వర్యంలో శుక్రవారం మహాధర్నా. వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని బందల్ల, మాసపురం, గంగమ్మతల్లి, శివాలయం లింకు రోడ్ల నిర్మాణ పనులు చేపట్టాలని రైతుసంఘం అధ్వర్యంలో స్థానిక రైతులు 45 రోజులుగా రిలే నిరాహర దీక్షలు చేపట్టారు. శుక్రవారం రైతులతో పాటు మహిళా రైతులు, రైతు కూలీలతో మహాధర్నా ఏర్పాటు చేశారు. అలాగే రోడ్డుపై వంటలు చేసి నిరసన వ్యక్తం చేశారు. బుర్రకథ ఎల్లప్ప కళాబృందం సభ్యులు రైతులకు మద్దతుగా పాటలు పాడారు. అలాగే పలు పార్టీల నాయకులు, రైతులు మద్దతు తెలిపారు.

ప్రభుత్వానికి కనువిప్పు కలగడంలేదు..

రోడ్ల కోసం రైతులు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వానికి కనువిప్పు కలుగుతలేదని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, కేకేసీ రాష్ట్ర ఇన్‌చార్జి కెప్టెన్ కరుణాకర్ రెడ్డి విమర్శించారు. నియోజకవర్గ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు 20రోజుల్లో స్పందించాలని డిమాండ్ చేశారు. లేదంటే తానే కంకర వేసి స్థానికుల సహకారంతో పనులు ప్రారంభిస్తానన్నారు. రెంజల్‌లో రైతుల దీక్షలకు శుక్రవారం ఆయన మద్దతు తెలిపారు. అధికారం లేకపోయినా ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో ప్రతీ మండలానికి ఒక జేసీబీ యంత్రాన్ని అందిస్తానన్నారు. ఎంపీపీ లోలపు రజని, జెడ్పీటీసీ విజయ, ఎడపల్లి మాజీ ఎంపీపీ భాస్కర్‌రాజ్, మాజీ సర్పంచ్ శంకర్‌నాయుడు, మాజీ ఎంపీటీసీ బొడ సావిత్రి, ఇందిరారెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్తం

కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత

మాక్లూర్: మండలంలోని అడవి మామిడిపల్లిలో పలువురు లబ్ధిదారులకు శుక్రవారం సర్పంచ్ చింత మల్లారెడ్డి కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. వీడీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వేల్పూర్: వేల్పూర్‌లో లబ్ధిదారులు మంజూరైన కల్యాణలక్ష్మీ చెక్కులను స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు అందజేశారు. సర్పంచ్ తీగెల రాధామోహన్, ఉపసర్పంచ్ పిట్లసత్యం తదితరులు పాల్గొన్నారు.

'మేరా మాటి– మేరా దేశ్'

బోధన్/వేల్పూర్: బోధన్, వేల్పూర్ మండలాల్లో శుక్రవారం బీజేపీ నాయకులు మేరా మాటి– మేరా దేశ్' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రాకాసీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సాలూర జెడ్పీహెచ్ఎస్‌లో బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. మట్టి దీపాలు వెలిగించి పంచ ప్రాణ్ ప్రతిజ్ఞను విద్యార్థులతో చేయించారు.

ఎస్సైగా ఎంపిక

మాక్లూర్: మండలంలోని కొత్తపల్లికి చెందిన ఏ సుచిత్ర ఎస్సైగా ఎంపికైంది. కామారెడ్డి జిల్లాకు చెందిన సుచిత్ర, మాక్లూర్ మండలం కొత్తపల్లికి చెందిన సుమంత్‌ను కులాంతర వివాహం చేసుకుంది. ప్రస్తుతం వీరికి ఒక బాబు, పాప ఉన్నారు. కులాంతర వివాహం చేసుకోవటం వల్లే పట్టుదలతో చదివినట్లు సుచిత్ర వెల్లడించారు.

విద్యార్థులకు పుస్తకాల అందజేత

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని రెండో వార్డు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్, వర్క్‌బుక్ పుస్తకాలను శుక్రవారం కౌన్సిలర్ ఖాందేష్ సంగీత అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య పరీక్షలు..

ఆర్మూర్‌లో లయన్స్ కంటి ఆస్పత్రిలో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం ఆధ్వర్యంలో ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఆపరేషన్లు, కళ్ల అద్దాలు పంపిణీ చేశారు.

గృహలక్ష్మి దరఖాస్తులు 920

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లో గృహలక్ష్మి పథకానికి మొత్తం 920మంది దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దార్ శ్రీకాంత్ శుక్రవారం తెలిపారు. ప్రభుత్వం దరఖాస్తు స్వీకరణ తేదీ పొడిగిస్తే మళ్లీ తీసుకుంటామని పేర్కొన్నారు.

గృహలక్ష్మి దరఖాస్తు గడువు పెంచాలి



నవీపేట: గృహలక్ష్మి దరఖాస్తు గడువును పెంచాలని బీజేపీ నాయకులు శుక్రవారం తహసీల్దార్ ధన్వాల్‌కు వినతిపత్రం సమర్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు ద్యాగ సరిన్ మాట్లాడుతూ.. ఈనెల 10న గడువు ముగిసిందని అధికారులు పేర్కొనగా, ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో 14 వరకు దరఖాస్తులు తీసుకోవడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. నాయకులు పిల్లి శ్రీకాంత్, రామకృష్ణ, భూషన్, చరణ్‌రెడ్డి, బాల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

14లోపు 'గృహలక్ష్మి' దరఖాస్తు చేసుకోండి

బోధన్: నియోజకవర్గం పరిధిలో గృహలక్ష్మి పథకం కోసం ఆసక్తిగల వారు పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఈనెల 14లోపు దరఖాస్తులు సమర్పించాలని బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు.

తానాకలాన్‌లో వైద్య శిబిరం

ఎడపల్లి(బోధన్): మండలంలోని తానాకలాన్‌లో శుక్రవారం ప్రతిభా ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజలకు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. డాక్టర్ గౌతమ్, సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, హాస్పిటల్ మేనేజర్ శ్రీధర్, వెంకటేష్, పాల్గొన్నారు.

కోటగిరి తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

రుద్రూర్: కోటగిరి తహసీల్దార్‌గా ప్రభాకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.కాంగ్రెస్ నాయకులు తహసీల్దార్‌ను సన్మానించారు. మాజీ ఎంపీపీ గంగాధర్, ఎంపీటీసీ మనోహర్ పాల్గొన్నారు.

మక్కపంట ధ్వంసం

బాల్కొండ: మండలంలోని శ్రీరాంపూర్‌లో జంగం అనితకు చెందిన రెండు ఎకరాల మక్క పంటను గురువారం అర్ధరాత్రి అడవిపందుల ధ్వంసం చేశాయి. సుమారుగా రూ.40వేల నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు కోరారు.

క్రీడా సామగ్రి వితరణ

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులకు కమ్మర్‌పల్లి రైతుబంధు సమన్వయకర్త సుంకరి మురళి క్రీడా సామగ్రి వితరణ చేశారు. ఎంపీటీసీ సుధాకర్, బీఆర్‌ఎస్ నాయకులు హల్దే శ్రీను, కేజీబీవీ ఎస్ఓ గంగామణి పాల్గొన్నారు.

రాజేశ్వర్‌రావుకు మంత్రి శుభాకాంక్షలు

వేల్పూర్: రాష్ట్ర క్రిష్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావుకు రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో శుభాకాంక్షలు తెలిపారు. అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు, రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్వే

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో అనాథ పిల్లల సర్వే శుక్రవారం రెండోరోజు కొనసాగింది. ఈ నెల 15 వరకు సర్వే పూర్తిచేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక..



బాల్కొండ: మండలంలోని బోదేపల్లి గ్రామానికి చెందిన వజ్రయూత్ సభ్యులు శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్, నాయకులు కొమ్ముల సంతోష్, రమేష్, శ్రీనివాస్, రుత్విక్, వినయ్ ఉన్నారు.

కాంగ్రెస్‌లోకి పలువురు..



మోర్తాడ్: ఏర్గట్ల మండలం తొర్తికి చెందిన పలువురు యువకులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ నాయకుడు ముత్యాల సునీల్‌రెడ్డి కండువా కప్పి, కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. మండల అధ్యక్షుడు సోమ దేవారెడ్డి, నాయకులు గంగాప్రసాద్, అనిల్, భానుచందర్ పాల్గొన్నారు.

ఏసీపీ కార్యాలయం పేరు మీద ఫేక్ ఖాతా

ఆర్మూర్‌టౌన్: గుర్తు తెలియని వ్యక్తులు ఆర్మూర్ ఏసీపీ కార్యాలయం పేరు మీద ఫేస్‌బుక్‌లో ఫేక్ ఖాత సృష్టించినట్లు ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఫేక్‌ఖాతతో ఫేస్‌బుక్‌లో ఉన్న వారికి డబ్బులు అడుగుతున్నారన్నారు. ఎవరు కూడా స్పందించవద్దని ఆయన పేర్కొన్నారు.

ఆధ్యాత్మికం..

మహారాజ్ దీక్ష ప్రారంభం



నందిపేట్: మండల కేంద్రంలోని కేదారేశ్వర ఆశ్రమంలో శుక్రవారం ఆశ్రమ వ్యవస్థాపకులు మంగి రాములు మహారాజ్ అర్థ చాతుర్మాస దీక్ష, 108 రోజుల పాటు అనుష్టాన దీక్షను ప్రారంభించారు. ముందుగా సంకల్పపూజ, సామూహిక లలిత సహస్రనామ స్తోత్రం నిర్వహించారు. కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

శ్రీవారి ఆలయంలో ప్రత్యేక పూజలు

బోధన్: పట్టణంలోని వేంకటేశ్వర ఆలయంలో శుక్రవారం అధిక శ్రావణ మాసం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు మహిళలు ఆలయ పూజారికి అధిక వాయనంగా దీప, వస్త్ర, స్వయంపాక దానం కార్యక్రమం నిర్వహించారు.

ఆధునిక సాగు పద్ధతులు పాటించాలి



రాణంపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు.. భవానీపేటలో..

రుద్రూర్: వ్యవసాయంలో ఆధునిక సాగు పద్ధతులు పాటించాలని వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు సూచించారు. మండలంలోని రాణంపల్లి గ్రామంలో శుక్రవారం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సిరిసిల్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు పీఆర్ఏ (పార్టీసిపేటరీ రూరల్ అప్రేసల్) కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు గ్రామంలో వనరులు, నేలల రకాలు, జనాభా శాతం, గ్రామ సామాజిక పటం, పంట పొలాల సమస్యలపై చార్టులను ప్రదర్శించి రైతులకు వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్వేత, సర్పంచ్ రోజా, తోట సంగయ్య, లక్ష్మీ ప్రసాద్, సత్యానంద్ పాల్గొన్నారు.

బోధన్ మండలంలో..

బోధన్ రూరల్ (బోధన్): మండలంలోని భవానీపేట గ్రామ పంచాయతీ ఆవరణలో జగిత్యాల వ్యవసాయ కళాశాల విద్యార్థుల బృందం, రుద్రూర్ కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రైతులకు ఆధునిక వ్యవసాయంపై అవగాహన కల్పించారు. పంటల మార్పిడి ఆవశ్యత, నీటి వనరుల వినియోగం అంశాలను వివరించారు. సర్పంచ్ కృష్ణ ప్రసాద్, సొసైటీ చైర్మన్ ముత్తారెడ్డి, శాస్త్రవేత్త రాజ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పద్మశాలి యుద్ధభేరికి తరలిరండి



పెర్కిట్(ఆర్మూర్)/బాల్కొండ: జగిత్యాల జిల్లా కోరుట్లలో ఈనెల 13న నిర్వహించే పద్మశాలి రాజకీయ యుద్ధభేరికి, పద్మశాలీలు తరలిరావాలని సంఘ ప్రతినిధులు కోరారు. ఈమేరకు కార్యక్రమ వాల్‌పోస్టర్లను శుక్రవారం పెర్కిట్ ఎమ్మార్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో పద్మశాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బిజ్జు దత్తాద్రి ఆవిష్కరించారు. అలాగే బాల్కొండలో మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు మానేటి నాగభూషణం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలన్నారు. కార్యక్రమానికి ఇంటికి ఇద్దరు చొప్పున తరలి రావాలని పిలుపునిచ్చారు. దాసరి సునీల్ కుమార్, బంది శ్రీహరి, భోగ వెంకటరమణ, అంబాల తిరుపతి, గంగాధర్, చిట్ల యగ్నేష్, జిందం నరహరి తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు | తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	గదర్-2 (హిందీ) -11.20 6.15
	ఓఎంజీ-2 (హిందీ) -2.55 9.50
స్క్రీన్-2 –	భోళా శంకర్ (తెలుగు) -9.10 12.30 3.50 7.10 10.30
స్క్రీన్-3 –	జైలర్ (తెలుగు) -11.15 2.40 6.05 9.30
స్క్రీన్-4 –	భోళా శంకర్ (తెలుగు) -12.00
	బ్రో (తెలుగు) -3.20
	ఉస్తాద్ (తెలుగు) -6.15
	గదర్-2 (హిందీ) -9.30